# ఆసియాలో విస్తరిస్తున్న జర్మనీ సామ్రాజ్యవాదులు

**2017** మే నెలాఖరులో భారత ప్రధాని నరేంద్రమోడీ జర్మనీలో పర్యటించారు. రోడ్లు, రైల్వేలు, పౌర విమానయానం, ఆధునిక సమాచార సాంకేతికత వంటి మౌలికవసతులరంగాల అభివృద్ధికిగాను భారత్‌లో పెట్టుబడులు పెట్టవలసిందిగా ఆయన జర్మనీ ఛాన్సలర్ మెర్కెల్‌ను కోరారు. ఇరు ప్రభుత్వాల మధ్య నాల్గవ పర్యాయం జరిగిన సంప్రదింపుల ప్రకారం ప్రతి సంవత్సరం వందకోట్ల యూరోల బడ్జెట్‌కు అంగీకరించారు. 17 వందలకోట్ల యూరోల పెట్టుబడులతో జర్మనీ, యూరోపియన్ యూనియన్ దేశాలలో ఇండియాకు ప్రధాన భాగస్వామిగా ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో కూడా ప్రధానమైనదిగా ఉంది. జర్మన్ కంపెనీలు ఇండియాలో పెట్టిన పెట్టుబడుల విలువ 2010 నుండి ఇప్పటివరకు రూ. 53000 కోట్లు. 1600కు పైగా జర్మన్ కంపెనీలు, 600కు పైగా భాగస్వామ్య కంపెనీలు ఇండియాలో పనిచేస్తున్నాయి. మేకిన్ ఇండియా, స్వచ్ఛ భారత్, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్మార్ట్‌సిటీస్ వంటి కార్యక్రమాలకు ఇప్పటికే జర్మనీ సహకరిస్తున్నది. ఈ పర్యటనలో ఇరుదేశాలూ పై కార్యక్రమాలకు సంబంధించి 12 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఇవికాక రైల్వేల భద్రతకు సంబంధించిన మరో ఒప్పందంపై కూడా సంతకం చేశాయి. ఢిల్లీలోని జర్మనీ విదేశాంగ ప్రతినిధి మార్టిన్‌నే జర్మనీకి ఇండియా వ్యూహాత్మక భాగస్వామి అయినందున, జర్మనీ ప్రభుత్వం ఇండియాకు రక్షణ సామాగ్రి సమకూర్చటానికి సిద్ధంగా ఉందన్నాడు. హిందూ మహాసముద్ర ప్రాంతంపట్ల వారికి అమితాసక్తి ఉందన్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌లో సుస్థిరత సాధించే విషయంలో ఇండియాకు మద్దతుగా నిలుస్తామన్నాడు.

జర్మనీ నుండి మోడీ స్పెయిన్ వెళ్ళిన 3వరోజే చైనా ప్రధాని లీకేక్యింగ్ బెర్లిన్‌కు వచ్చాడు. అనేక ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరాయి. జి–20 శిఖరాగ్ర సభకు ముందుగానే జరిగిన వారి ప్రైవేటు చర్చలలో అక్కడ ఒకే పద్ధతిలో వ్యవహరించాలనుకున్నారని తెలియవచ్చింది. యూరోపియన్ యూనియన్ వెలుపల ఉన్న దేశాలలో చైనాతో జర్మనీ సంబంధాలు చాలా విస్తృతంగా ఉన్నాయి. ఫ్రాన్సుకన్నా, బ్రిటనుకన్నా చైనాతో 170 బిలియన్ యూరోల వ్యాపారంతో జర్మనీ ముందుంది. నూతన సిల్కు రహదారి (న్యూ సిల్క్ రోడ్) కోసం జర్మనీకి చెందిన డ్యూట్షే బ్యాంకు, చైనా అభివృద్ధి బ్యాంకుకు మూడు బిలియన్ యూరోలు అప్పివ్వటానికి ఒప్పందం కుదిరింది. ఈ సిల్కు రహదారిలో చైనాను యూరప్‌కు అనుసంధానించే పోర్టులు, రోడ్లు, రైళ్ళ నిర్మాణం జరగనుంది.

“అమెరికా ఇంకెంతమాత్రము నమ్మదగిన మిత్రదేశంగా లేదు. ఇక యూరప్ తన వ్యవహారాలు తానే చూసుకోవాలి” అని జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ చేసిన వ్యాఖ్య నేపథ్యంలో, ఆసియాకు చెందిన ఈ రెండు పెద్ద దేశాల అధినేతల సందర్శన ప్రాముఖ్యతను సంతరించుకొంది. ఇది ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలు దెబ్బతినడం వల్ల కోపంతో చేసిన వ్యాఖ్య కాదు. మార్చి 24న జర్మనీ విదేశాంగ మంత్రి సిగ్మర్ గాబ్రియేల్ జర్మనీ యొక్క “ఆసియా విధానం”పట్ల ‘ఒక కొత్త దృక్పథాన్ని’ ప్రకటించాడు. ఏప్రిల్ 5, 6 తేదీలలో హిందూ మహాసముద్ర ప్రాంతానికి చెందిన 40 మంది జర్మనీ రాయబారులను సమావేశపరిచాడు. ఆసియాలో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమను తాము కీలకమైనవిగా భావించుకుంటాయనీ, కనుక వాటిని మరింత వ్యూహాత్మకంగా సంఘటితపరచాలనీ, తద్వారా ఈ ప్రాంతపు 4 బిలియన్ల ప్రజలను, పెరుగుతున్న మార్కెట్లను సమర్థంగా ఉపయోగించటం అవసరమన్నదే ఈ నూతన దృక్పథ సారాంశం. కనుక మొట్టమొదటి సారిగా విదేశీ మంత్రిత్వశాఖలో ఆసియా విభాగాన్ని ప్రారంభించాలని నిర్ణయమైంది. పైపెచ్చు, ఆసియా – పసిఫిక్ బిజినెస్ అసోసియేషన్ వార్షిక సమావేశంలో గేబ్రియల్ ఈ విధంగా ప్రకటించాడు : “మన భవిష్యత్తు విషయంలో ఆసియా కీలకమైన ప్రాంతం. ఎందుకంటే ఇతర దేశాలు చేసే సవాళ్ళను పరిష్కరించుకోడానికి రెండవ ప్రపంచ యుద్ధానంతరం రూపొందించుకున్న మార్గాలను పాత నిర్మాణాలతో అభివృద్ధి చేయలేం. కాగా, ప్రపంచ సవాళ్ళను పరిష్కరించుకునే మార్గాలు ఆసియా వద్ద వున్నాయి”.

ఈ ప్రాంతంలో జర్మనీకి మిలటరీ ప్రయోజనాలు ఉన్నాయన్నది రహస్యమేమీ కాదు. కొలంబో కాన్ఫరెన్స్‌లో స్టేట్ సెక్రటరీ మార్కస్ ఎడిరర్ ఇలా అన్నారు : “యూరప్ తన రక్షణ విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా లేదు. ఇరాన్‌తో అణ్వస్త్ర ఒప్పందం విషయంలో మనం జాగ్రత్తగా వున్నాం. సోమాలియాలో పరిస్థితులు చక్కదిద్దటానికి సహాయం చేస్తున్నాం. సోమాలియాలో పైరసీ అరికడుతున్నాం. యెమెన్‌కు మానవతా దృక్పథంతో సహాయం చేస్తున్నాం. ఈ ప్రాంతంలోని మన భాగస్వాములతో కలిసి రక్షణ సహకారాన్ని మరింత పెంపొందించాలి”.

అమెరికా తన ఆసియా విధానంలో భాగంగా చైనాను చుట్టుముట్టి ఏకాకిని చేయడానికీ, ఉత్తర కొరియాపై ప్రత్యక్ష సైనిక దాడి చేయడానికీ చేస్తున్న ప్రయత్నంలో కలుగచేసుకోవాలన్నది జర్మనీ లక్ష్యంగా కనబడుతున్నది. జర్మనీ సామ్రాజ్యవాద ఆకాంక్షలను గేబ్రియల్, ఎడరర్‌ల ప్రకటనలు స్పష్టం చేస్తున్నప్పటికీ, హిందూ మహాసముద్రంలో అమెరికా సామ్రాజ్యవాదపు నౌకా బలగానికి వీరి బలగం సాటిరాదు. ఈ విషయమై జర్మనీలోని పాలకవర్గపు ముఖ్యులలో కొందరు అనుమానాలు వెలిబుచ్చారు కూడా.

ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలు – మిలటరీ ప్రయోజనాలకు దారితీస్తాయని మరొక్కసారి ఋజువౌతున్నది. ఇది సామ్రాజ్యవాద శక్తుల మధ్య ఘర్షణకు దారితీస్తుంది. అంతేగాక అది యుద్ధాలకు దారితీసి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలను లొంగదీసుకోవటానికి దోవతీస్తుంది.

○○○○